క్లుప్తంగా...

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో శుక్రవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నారని మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణుచారి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని వివరించారు.

ఆర్ఎంసీ ప్లాంట్ దరఖాస్తు తిరస్కరణ

పోచారం: నారపల్లిలోని శ్రీరాంనగర్ కాలనీకి సమీపంలో ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు రాంకీ సంస్థ చేసుకున్న దరఖాస్తును కాలుష్య నియంత్రణ మండలి తిరస్కరించింది. సమీపంలో ఓ పాఠశాల, నివాస ప్రాంతం ఉండటంతో అనుమతి లభించలేదు. అంతేగాక ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభ దశలో ఉన్నప్పుడే నిర్వాహకులకు శ్రీరాంనగర్ కాలనీవాసులు అభ్యంతరం తెలిపారు. ఇదే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దరఖాస్తును తిరస్కరించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

శామీర్‌పేట్: సీఎంఆర్ఎఫ్ నిధి పేదలకు వరమని జగ్గంగూడ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన శ్రీలతకు రూ.26 వేల చెక్కు, చందుపట్ల బాలమణికి రూ.22,500 ల చెక్కులను గురువారం లబ్ధిదారులకు సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పలువురు వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీ నల్లపోచమ్మ ఆలయంలో మున్సిపల్ బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారి దర్శించుకున్నారు. రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, నర్సింగ్‌రావు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, బీజేవైఎం అధ్యక్షుడు వంశీ, మహిళా అధ్యక్షులు హేమలతరెడ్డి, కృష్ణప్రియ మల్లారెడ్డి, నాయకులు అవినాశ్‌చారి, ఈశ్వర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బద్రీనాథ్ ఆలయానికి బస్సులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ సమీపంలోని గజ్వేల్ నియోజకవర్గ పరిధి బండమైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన బద్రీనాథ్ ఆలయానికి మేడ్చల్ డిపో నుంచి బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటల నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమై ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు నడపనున్నట్లు తెలిపారు. ఆలయం నుంచి రాత్రి 7.20 వరకు బస్సు అందుబాటులో ఉంటుందని వివరించారు. రూ.30 బస్‌చార్జీ ఉంటుందని, ఆలయాన్ని సందర్శించే భక్తులు, ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారం రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టదా..?

బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి



ఘట్‌కేసర్: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది వారం రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి దున్నపై వర్షం పడినట్లుగా ఉందని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు గురువారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, సిబ్బందికి ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, కనీస వేతనం చెల్లించాలన్నారు. వీరేశం, మధుసూదన్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, జేఏసీ నేతలు జయచంద్ర, సబితా పాల్గొన్నారు.

బస్.. ఫిట్‌లెస్..

- స్కూల్ బస్సుల సామర్థ్యంపై అనుమానాలెన్నో..?
- కాలం చెల్లిన బస్సులు.. సగానికి పైగా ఫిట్ లేనివే..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యా సంస్థలు నడుపుతున్న బస్సులు, వ్యాన్లు 5 వేలకు పైమాటే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: సామర్థ్యం లేని.. కాలం చెల్లిన బస్సులతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంతో ఎక్కడ ఏ బస్సు ప్రమాదం జరిగినా.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. విద్యా సంస్థల బస్సులు, వ్యాన్లు, వాహనాల ఫిట్‌నెస్ పత్రాలు పొందకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. విద్యా సంస్థల వాహనాలను తనిఖీ చేసి, సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సిన జిల్లా రవాణా శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు లేకపోవడంతో సామర్థ్యం లేని బస్సులు, వ్యాన్లకు ఎప్పుడు.. ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం వెంటాడుతోంది.

ప్రభుత్వ, ప్రైవేట్ బడులు 2 వేలకు పైనే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,018 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5,85,573 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇవి కాకుండా 385 వరకు ఇంటర్మీడియెట్, ఇంజినీరింగ్, డిగ్రీ, ఇతర కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో మరో 3.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల పరిధిలో 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఏడు మున్సిపల్ సర్కిళ్లు ఉన్నాయి. విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థం సిటీ నలుమూలల నుంచి కూడా విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి.

ఫిట్‌నెస్‌పై అనుమానాలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 3,875 స్కూల్, 1500 పైగా కాలేజీ బస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు మూడు వేల బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందినట్లు రవాణా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికీ సగానికి పైగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకపోవడంతో ఆయా బస్సుల్లో తమ పిల్లల ప్రయాణంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీఏ అధికారులు ఏం చేస్తున్నారు..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్కూల్స్, కాలేజీల బస్సులు, వ్యాన్లు ప్రమాణాలు పాటిస్తున్నాయా? డ్రైవర్ అనుభవజ్ఞుడేనా? సహాయకుడు ఉన్నాడా? తదితర వాటిపై ఆర్టీఏ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. ప్రమాదాలను ముందే గుర్తించి, నియంత్రించాల్సిన అధికారులు వాటిని పాటించకుండా.. రోడ్డు ప్రమాదాలు జరిగి విద్యార్థులు గాయపడటం, మృత్యువాత పడటం వంటి ఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసి, కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కుట్టుమిషన్ల పంపిణీ

ఘట్‌కేసర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు గురువారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అవుషాపూర్‌లో 30 మంది, ఎదులాబాద్‌లో 30 మంది, ఘట్‌కేసర్‌లో 25 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. కార్మిక మంత్రి మల్లారెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, సర్పంచ్‌లు కావేరి, సురేశ్‌తో కలిసి లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ సరళ, ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, రైతుబంధు జిల్లా సభ్యులు మంకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, న్యాక్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, సర్పంచ్ కావేరి

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రభాకర్‌యాదవ్

జవహర్‌నగర్: తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర సంఘం సాధారణ సమావేశం గురువారం టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రభాకర్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ ప్రభాకర్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానన్నారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్, ఎండీ.సాబెర్ అలీ, సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, పర్వతాలు, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

పారిశుద్ధ్య కార్మికుల నిధులు వాడుకోవడం సిగ్గుచేటు

అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి



అవుషాపూర్ పారిశుద్ధ్య కార్మికులకు సొంత డబ్బులతో జీతాలు అందజేస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: రెండు నెలలుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల జీతాల చెక్కులు ఎస్టీఓలో పాస్‌కాకపోవడం సిగ్గుచేటని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి అన్నారు. రెండు నెలలు జీతాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వెతలు చూడలేక గురువారం సర్పంచ్ సొంత డబ్బుతో ఒక నెల జీతాలు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి ఎస్టీఓలో జమచేస్తే కార్మికుల జీతాల చెక్కులు పాస్ చేయకుండా ప్రభుత్వమే మా నిధులు వాడుకుంటోందని దుయ్యబట్టారు. పైసా విడుదల చేయకుండా ప్రజల సొమ్ముతో సంబరాలు నిర్వహించాలని ఆదేశించిన ఘటన దేశంలో ఎక్కడా జరగలేదని, రెండు నెలలుగా కార్మికుల కడుపు కాల్చడం సమంజసం కాదన్నారు. పారిశుద్ధ్య కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే జీతాల చెక్కులు ఎస్టీఓలో పాస్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ రాధాకృష్ణ



ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దాత్రిక రాధాకృష్ణ

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని దాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా దాత్రిక రాధాకృష్ణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి వీరేశం రాధాకృష్ణతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని, భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నర్సింహ్మారెడ్డి, పూజారులు కార్తీక్,అయ్యప్ప,వంజరి సంఘం నాయకులు కృష్ణ,మధుకర్, శ్రీనివాస్ మూర్తి, గిరిబాబు, ప్రసాద్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సైనికుల్లా పనిచేస్తున్నారు

– మంత్రి చామకూర మల్లారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ఘట్‌కేసర్ చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులు సైనికుల్లా పనిచేస్తున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.2.06 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రూ.37 లక్షలతో గ్రంథాలయం అదనపు గది పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్‌తో కలిసి గురువారం మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసే సత్తా కౌన్సిల్ సభ్యులకు ఉందని, పెండింగ్ పనులను పూర్తి చేసే సత్తా తనకే ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, అనురాధ, శశికళ, హేమలత, వసంత, నాగజ్యోతి, మల్లేశ్, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, జహంగీర్, రవీందర్, కోఆప్షన్ సభ్యులు షౌకత్, అరుణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, నరేశ్‌గౌడ్, మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాప్రా డివిజన్‌లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పాదయాత్ర

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కాప్రా: మీ కోసం మీ ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కలిసి కాప్రా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో కందిగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రహరీ నిర్మించాలని, మురుగు కాల్వల నుంచి తీసిన వ్యర్థాలను తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని, పార్కు అభివృద్ధి చేయాలని కాలనీవాసులు సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సుడుగు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్‌బర్ట్, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్, రఘుపతిరెడ్డి, బేతాళ బాలరాజు, ఏనుగు సీతారాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి, బద్రుద్దీన్, పవన్, పాండు, కొండల్‌గౌడ్, మల్లారెడ్డి, గణేష్, భిక్షపతి, చందు, గౌస్, సుశీల్, సంతు, బబ్లు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలే ఏజెండాగా తీసుకొని రాజకీయాలకు తావులేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. గురువారం కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ శిరిడీనగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్, జలమండలి డీజీఎం సతీష్‌కుమార్, ఏఈ రోహిల్, కాలనీవాసులు రిజ్వాన్‌ఖాన్, సత్తయ్య, స్వామిగౌడ్, చెన్నారెడ్డి, వెంకటరాంరెడ్డి, సత్తిరెడ్డి, మౌలాలి, వేణుగోపాల్, రాము యాదవ్, కుశాల్, సుకుమారి, గోవింద్, నాయకులు సుడుగు మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, గిల్‌బర్ట్, పవన్, సుశీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి పనులు



సాయిధరణి కాలనీలో పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో అందరి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని, అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని సాయి ధరణి ఫేస్–1లో కమిటీ హాల్ స్లాబ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సాయిధరణి ఫేస్–1లో కమిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నేతలు అన్నంరాజు శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అక్బర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వెంచర్ నిర్వాహకులకు రూ.61 వేల జరిమానా



యాద్గార్‌పల్లిలో పర్యటిస్తున్న డీపీఓ రమణమూర్తి

కీసర: గ్రామాల్లో మొక్కలను నరికేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి అన్నారు. గురువారం యాద్గార్‌పల్లిలోని ఓ వెంచర్‌లో నిర్వాహకులు పెంచిన చెట్లు, చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా నరికివేయడంతో సదరు వెంచర్ యజమానులపై సుమారు రూ.61 వేల జరిమానా వేసి రుసుమును వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని వివిధ కాలనీలు, వెంచర్లలో నాటిన మొక్కలను తొలగించడం, మొక్కలు, చెట్ల కొమ్మలు నరివేయడం తదితర పనులు చేపట్టవద్దన్నారు. యాద్గార్‌పల్లి వెంచర్‌లో 192 చెట్ల కొమ్మలను వెంచర్ నిర్వాహకులు నరికేసినట్లు విచారణలో తేలిందన్నారు. అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకొని చెట్లు తొలగించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి లక్ష్మణ్, ఎంపీఓ వినూత్నరెడ్డి, గ్రామ కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

16న నాగారంలో బోనాలు

కీసర: నాగారం మున్సిపాలిటీలో ఈ నెల 16వ తేదీన బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లోని గ్రామదేవతల ఆలయాలను బోనాల ఉత్సవాల సందర్భంగా సుందరంగా తీర్చిదిద్దడం, రంగులు వేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా సంతోషంగా బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

కీసర: కీసర మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో పాటు అన్ని రకాల శాఖల సిబ్బందికి మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి స్పృహ కోల్పోయిన వ్యక్తులకు వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ సూర్యకాంత, ఏఎన్ఎం రాణి, ఇందిరా పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

మల్కాజిగిరి: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో యూజీడీ, తాగునీటి సరఫరా పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. వర్షాకాలంలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీపీ రజనీకాంత్, సంపత్, కిషోర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



కీసర: అనారోగ్య కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు. గురువారం కీసర గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందిన మొరుగు వాణిశ్రీ, తుడుం బాలమ్మ, చెట్టి హనుమంత్, చిలుక బాలమ్మ, శీలం లక్ష్మమ్మ, గోరంటి చింటు, పడిగిపాల జంగయ్య కుటుంబసభ్యులను పరామర్శించడంతో పాటు మంత్రి మల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, నేతలు గోరంటి ప్రవీణ్, రమేష్, మల్లేష్, చినింగని బాల్‌రాజ్, పరమేష్, రాగుల గణేష్, మహేష్, సాయియాదవ్, రాఘవేందర్‌గౌడ్, సతీష్‌యాదవ్, చెట్టి మధుయాదవ్, లత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు

- జెడ్పీలో హైడ్రామా
- జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని.. రాజీనామా లేఖతో కలెక్టరేట్‌కు..
- మంత్రి ఫోన్ చేయడంతో వెనుదిరిగిన జెడ్పీ వైస్ చైర్మన్
- అనారోగ్యం కారణంగా రాజీనామాకు సిద్ధపడ్డట్లు వెంకటేశం వెల్లడి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పేదలకు సేవ చేయాలన్న లక్ష్యం నెరవేరడం లేదని, అలాగే ఆరోగ్యం కూడా సహకరించడం లేదనే కారణంతో తన పదవికి రాజీనామా చేసేందుకు మేడ్చల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్తె వెంకటేశం సిద్ధపడ్డారు. ఈ మేరకు గురువారం తన రాజీనామా లేఖను కలెక్టర్‌కు అందజేసేందుకు వెళ్లారు. కానీ వెంటనే మనస్సు మార్చుకుని రాజీనామాను ఉపసంహరించుకొని వెనుదిరగడం సొంత పార్టీ బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడం ద్వారా జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టవచ్చనే యోచనతో కలెక్టరేట్‌కు వెళ్లిన బేస్తె వెంకటేశం హైకమాండ్ (అధిష్టానం) హెచ్చరికల నేపథ్యంలో వెనుదిరిగినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు ఈ ఘటనతో బహిర్గతమయ్యాయి.

మంత్రి మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు గుసగుసలు

మేడ్చల్‌లో మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితిలో విభేదాలు ఉన్నాయి. వీరిద్దరి మధ్య నెలకొన్న విభేదాలు ఇటీవల రెండు, మూడు సందర్భాల్లో బహిర్గతం కావడంతో పాటు పార్టీ పెద్దల ముందే మాటల యుద్ధానికి దిగిన విషయం తెలిసిందే. పార్టీలో అంతర్గత శత్రువుగా ఉన్న మలిపెద్ది సుధీర్‌రెడ్డితో సహా ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిని వ్యూహాత్మకంగా బయటకు పంపాలన్న ఉద్దేశ్యంతోనే మంత్రి మల్లారెడ్డి తన అనుచర వర్గాలతో పావులు కదుపుతున్నట్లు స్థానిక బీఆర్ఎస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎత్తుగడ, వ్యూహంలో భాగంగానే మంత్రి తన అనుచరుడైన జెడ్పీ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే తనయుడు జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ప్లాన్ వేసినట్లు స్థానిక పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశం అక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు పదవికి రాజీనామా చేస్తున్నానని, దీని కోసమే కలెక్టర్‌కు లెటర్ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వెళ్తున్నట్లు పేర్కొని నేరుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.

మంత్రి కేటీఆర్ దృష్టికి..

అక్కడే ఉన్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్త వెంకటేశం రాజకీయ వ్యూహాన్ని పసిగట్టడంతో పాటు ఈ విషయాన్ని పార్టీ పెద్దలతో పాటు తండ్రి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించిన తండ్రి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఈ విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మంత్రి కేటీఆర్ కూడా వెంటనే ఏమీ జరగదని సుధీర్‌రెడ్డికి నచ్చజెప్పడంతో పాటు జిల్లా మంత్రి మల్లారెడ్డికి ఫోన్ చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రి మల్లారెడ్డి కలెక్టరేట్ వద్ద ఉన్న జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశంకు ఫోన్ చేసి రాజీనామా లేఖను కలెక్టర్‌కు ఇవ్వకుండా వెళ్లిపోవాలని పేర్కొనడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.